

'విజిలెన్స్' వారోత్సవాలు

నగరంపాలెం: విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం విజిలెన్స్ వారోత్సవాలు జరిగాయి. ప్రాంతీయ అధికారి డి.సూర్యశ్రావణకుమార్ పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,633 క్యూసెక్కులు విడుదలవుతోంది.



18,503 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 12,825 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 18,503 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

వెనక్కి తగ్గిన వర్మ

- సూర్యలంక తీర సందర్శనకు పన్ను అంటూ బాపట్ల ఎమ్మెల్యే ప్రకటన
- టోల్‌గేట్ కూడా టీడీపీ నేతలకే అప్పగించే ఆలోచన
- ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతపై 'సాక్షి'లో కథనాలతో జంకిన వైనం
- దిగొచ్చి టోల్‌గేట్‌కు వేలంపాట

సాక్షి ప్రతినిధి,బాపట్ల: సూర్యలంక తీరంలో అక్రమార్జనకు పాల్పడాలని వ్యూహరచన చేసిన టీడీపీ బ్యాచ్ 'సాక్షి' వరుస కథనాలతో వెనక్కు తగ్గింది. తీరం సందర్శనకు తలకు రూ.20 చొప్పున పన్ను విధించే కార్యక్రమాన్ని ప్రస్తుతానికి వాయిదా వేసింది. సూర్యలంక తీరం సందర్శనకు వచ్చే ప్రతి ఒక్కరి నుంచి రూ. 20 చొప్పున పన్ను వసూలు చేయనున్నట్లు వారం రోజుల క్రితం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ప్రకటించారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతోపాటు దీనిపై 'సాక్షి' కథనాలు ప్రచురించింది. దీంతో ఎమ్మెల్యే వెనక్కి తగ్గారు. బీచ్ సందర్శనకు డబ్బు వసూలు చేయాలనేది తన సొంత నిర్ణయం కాదని, ప్రజల అభిప్రాయాలు తీసుకొని నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సూర్యలంక బీచ్‌లో వసతుల కల్పన కోసం తన ఆలోచన చెప్పానని, దాన్ని మీడియా వక్రీకరించిందని, ప్రజల అనుమతి తీసుకోకుండా ఏదీ చేయనని, అందరితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని సుభాషితాలు వల్లెవేశారు.



ఎమ్మెల్యే వర్మ దోపిడీ పథకంపై సాక్షిలో ప్రచురించిన కథనం క్లిప్

సాక్షి ఎఫెక్ట్..

దోపిడీ పథకం బెడిసికొట్టి..!

సూర్యలంక తీరంలో వాహనాల అనుమతికి టోల్ గేట్ పెట్టారు. టూవీలర్‌కు రూ.15, ఆటోకు రూ.30, కారుకు రూ.50, బస్సుకు రూ.100 చొప్పున ధరలు నిర్ణయించారు. గత ఏడాది వేలం పాట రూ.30 లక్షలు పలికింది. దీంతోపాటు ఇక్కడి కొన్ని టాయిలెట్స్, బాత్‌రూములు ఏర్పాటు చేసి నిర్వహణ కోసం వేలంపాట పెట్టగా ఏడాదికి రూ.5 లక్షలకు పాడుకున్నారు. ఇవి కాకుండా బల్లలు, గుర్రాలు, తీరంలో పర్యాటకులను తిప్పే బైక్‌లు నడిపేవారు పంచాయతీకి పన్నులు చెల్లిస్తున్నారు. వీటిపై ఏడాదికి రూ.8 లక్షల వరకు రాబడి ఉంది. ఇదంతా కొల్లగొట్టాలని టీడీపీ నేతలు యత్నించారు. దీనికి ఎమ్మెల్యే కూడా వంతపాడారు. వేలంపాటలు తప్పించాలని, పంచాయతీ మాటున వసూలుకు పాల్పడాలని శతవిధాలా యత్నించారు. దీనికి తోడు తీరం సందర్శనకు రూ.20 పన్ను విధించడంపై ప్రజలతోపాటు మత్స్యకారుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఒక ఎంపీ, జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలూ వర్మ తీరుపై అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. వీటన్నింటిపైనా 'సాక్షి'లోనూ కథనాలు ప్రచురితం కావడంతో ఎమ్మెల్యే వర్మ దోపిడీకి రచించిన పథకం బెడిసికొట్టింది. దీంతో ఆయన వెనక్కి తగ్గారు. తీరంలో సందర్శనకు పన్ను వసూలు అంశాన్ని వాయిదా వేశారు. వాహనాల అనుమతి కోసం ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌కు బుధవారం వేలంపాట పెట్టారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం


దీపం-2 పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

చీరాల: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దీపం-2 పథకాన్ని ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్యతో కలిసి శుక్రవారం ఈపూరుపాలెంలో కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఉచిత సిలిండర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మూడు నెలలకు ఒకటి చొప్పున ఉచితంగా ఇచ్చే సిలిండర్ ఖరీదు రూ.820లు కాగా, ఏడాదికి రూ.2475 చొప్పున ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రేషన్ కార్డుదారులందరికీ ఆధార్‌కార్డు అనుసంధానం చేసి అమలు చేస్తున్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో 3.53 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. దీపం-2 పథకం ద్వారా ప్రతి సంవత్సరానికి రూ.87 కోట్లు ఖర్చు అవుతాయని తెలిపారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ మహిళలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి దీపం-2 పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. ఈపూరుపాలెంలో త్వరలో ఇంటి స్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. అనంతరం ఎనిమిది మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.6.37 లక్షల చెక్కులు అందించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్, చీరాల ఆర్డీఓ చంద్రశేఖరనాయుడు పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్లు అందిస్తున్న కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, తదితరులు

కోటప్పకొండకు కార్తిక శోభ



- నేటి నుంచి కొండకు భక్తుల రాక
- నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికారులు

నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. స్వామిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి తరలి వచ్చే భక్తుల కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. కార్తిక మాసంలో కోటప్పకొండకు భక్తులు అధికంగా తరలివస్తారు. నెలరోజులు ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. భక్తులతో క్షేత్రం కళకళలాడుతుంది. సోమవారాలు, కార్తిక పౌర్ణమితో పాటు ఆదివారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా స్వామిని దర్శించుకునేలా వసతులు కల్పించారు.



త్రికోటేశ్వర స్వామి మూలవిరాట్


నాలుగు క్యూలైన్ల ద్వారా దర్శనం..

స్వామి దర్శనానికి వచ్చే భక్తులను నాలుగు క్యూలైన్ల ద్వారా అనుమతిస్తారు. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, మండప అభిషేక దర్శనం ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ మాసంలో ప్రత్యేక రోజుల్లో భక్తులు రద్దీ దృష్ట్యా స్వామి మూలవిరాట్ అభిషేకాలను రద్దుచేశారు. మండప అభిషేకాలకు అవకాశం కల్పిస్తారు. దీంతోపాటు దేవదాయ శాఖ నుంచి ప్రత్యేక సిబ్బందిని విధుల్లో నియమించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా కుళాయిలు ఏర్పాటుచేశారు. ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించేలా అదనపు కార్మికులను నియమించారు. భక్తులను కొండకు చేరవేసేందుకు నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను ఆర్టీసీ నడపనుంది.

పరోక్ష అభిషేక పథకం

కార్తిక మాసంలో భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు నిర్వహించేలా పరోక్ష అభిషేక పథకాన్ని ఆలయం నిర్వహిస్తోంది. రూ.1,000 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకున్న భక్తుల గోత్రనామాలతో రోజూ అభిషేకాలు చేస్తారు. గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్ వివరాలతో పాటు రూ.1,000 మనీయార్డర్, డీడీలను ఆలయ ఈఓ పేరుపై పంపి ఈ పథకంలో చేరవచ్చు. ఈ పథకంలో చేరిన భక్తులకు ఈ మాసంలో ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామి దర్శనం కల్పిస్తారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు



కార్తికమాసంలో త్రికోటేశ్వరుని దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక క్యూలైన్లు, ప్రసాదాలు సిద్ధం చేస్తున్నాం. పారిశుద్ధ్య చర్యలతో పాటు యాత్రికుల వసతి సౌకర్యాలపై దృష్టిసారించాం.

– డి.చంద్రశేఖర్, ఆలయ ఈఓ, కోటప్పకొండ

గృహాల మధ్య మద్యం దుకాణం వద్దు



రోడ్డుపై బైఠాయించిన మహిళలు, స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

- రోడ్డుపై బైఠాయించి మహిళల నిరసన
- ముప్పవరం గ్రామంలో ఘటన
- మొండిగా దుకాణం ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

జె.పంగులూరు: కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ విధానంపై మహిళలు మండి పడుతున్నారు. వ్యాపారులు సంపాదనే ధ్యేయంగా, నిబంధనలకు విరుద్ధంగా గృహాల మధ్యే మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. స్థానికుల నుంచి ఎంత వ్యతిరేకత వస్తున్నా తమ పంథా వీడటం లేదు. మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలోని మద్యం దుకాణాన్ని బొమ్మనంపాడు రోడ్డు, జగనన్న కాలనీకి సమీపంలో ఏర్పాటు చేసేందుకు నిర్మాణాలు చేపట్టారు. దీనిని గమనించి స్థానిక మహిళలు గృహ సముదాయాల సమీపంలో మద్యం దుకాణం పెట్టేందుకు వీలు లేదని నిర్వాహకులకు తెగేసి చెప్పారు. అయినా నిర్వాహకులు నిర్మాణాలు ఆపకపోవడంతో మహిళలు శుక్రవారం బొమ్మనంపాడు రోడ్డుపై బైఠాయించారు. అనంతరం పోలీసులు వచ్చి సర్ది చెప్పి పంపించారు.



ముప్పవరంలో నిర్మిస్తున్న మద్యం దుకాణం

80 కుటుంబాల నివాసం

ముప్పవరం గ్రామంలో పడమర వైపున గ్రామానికి 100 మీటర్ల దూరంలో 140 మందికి జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. వాటిలో 80 కుటుంబాలు వరకు నివాసం ఉంటున్నాయి. రాత్రి 10 గంటల వరకు గ్రామం నుంచి కాలనీకి మహిళలు, చిన్నారులు కాలినడకన రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం మహిళలు రాకపోకలు సాగించే ప్రాంతంలో మద్యం దుకాణం తీసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

అర్జీ పరిశీలిస్తాం

ముప్పవరంలో జరిగిన విషయం మా దృష్టికి వచ్చింది. మహిళలను వారి సమస్యలపై అర్జీ ఇవ్వమని కోరాం. వారి అర్జీ పరిశీలించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– భవాని, ఎక్సైజ్ సీఐ

ఒక్క దానినే ఉంటా



నేను ఒక్క దానినే ఇంటిలో ఉంటాను. కూరగాయలు, సరుకులు తీసుకురావాలంటే గ్రామంలోని సెంటర్‌కు వెళ్ళి తెచ్చుకోవాలి. మా కాలనీకి దగ్గర మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఎలా?

– ఎంవీ రమణ, ముప్పవరం వాసి

ఎలా తిరగాలి



నేను వ్యవసాయ కూలీని. ప్రతి రోజూ కూలి పనులకు వెళతాను. ఉదయం వెళ్ళి సాయంత్రం వస్తాను. మద్యం దుకాణం పెడితే నిత్యం మందుబాబులు తిరిగే మార్గంలో మేము ఎలా తిరగాలి?

– బాచిన రాజ్యలక్ష్మి, ముప్పవారం వాసి

ఆడవాళ్లు తిరగాలంటే ఇబ్బంది



నేను బండిమీద ఫ్యాన్సీ సామగ్రి అమ్ముకొని జీవిస్తుంటా. ఎప్పుడు వీలు పడితే అప్పుడు ఇంటికి వస్తా. గ్రామం నుంచి కాలనీకి రావాలంటే మద్యం దుకాణం మీదుగా రావాలి. ఇబ్బంది కదా..!

– కె.సుబ్బాయమ్మ, ముప్పవరం వాసి

జాతీయ రహదారిపై కారు దగ్ధం



కారులో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జె.పంగులూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైన ఘటన శుక్రవారం ఉదయం మండలంలోని భగవాన్ రాజు పాలెం గ్రామం వద్ద పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిపై జరిగింది. నేషనల్ హైవే సిబ్బంది తెలిపిన వివరాలు మేరకు.. ఒంగోలు కోర్టు సెంటర్‌కి చెందిన ఓ షోరూం మేనేజర్ డి.శివకుమార్ శుక్రవారం ఒంగోలు నుంచి గుంటూరు వైపు కారులో వెళ్తున్నారు. భగవాన్ రాజు పాలెం ఫ్లై ఓవర్ దిగుతుండగా ఒక్కసారిగా కారులో మంటలు వచ్చాయి. గమనించిన శివకుమార్ రోడ్డు పక్కన కారు ఆపి వెంటనే దిగారు. అద్దంకి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. అతనికి ఎలాంటి ప్రమాదం జరగలేదని హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

దొంగల ముఠా అరెస్ట్

రూ.2.57లక్షల విలువ గల 13 మోటార్లు, 2 గేదెలు, 2 దూడలు స్వాధీనం

చీరాల: చీరాల పరిసర ప్రాంతాల్లో పంట పొలాల్లోని వాటర్ మోటార్లు, గేదెల చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రూరల్ సీఐ శేషగిరిరావు వివరాలను వెల్లడించారు. చీరాల మండలం తోటవారిపాలేనికి చెందిన బుద్ధాపు కిషోర్, దాసరి రాంబాబు ఇద్దరు స్నేహితులు. వ్యసనాలకు బానిసలై వీరు ముఠాగా ఏర్పడ్డారు. రాత్రి వేళల్లో ఆటో, వ్యాన్‌పై సంచరిస్తుంటారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంట పొలాల్లోని వాటర్ మోటార్లు, ఊరికి దూరంగా ఇంటి బయట కట్టి ఉన్న గేదెలను దొంగతనం చేస్తుంటారు. వీరిద్దరిపై గతంలో చీరాల టూటౌన్, దర్శి, కర్నూలు, కర్లపాలెం, కొత్తపట్నం పోలీస్‌స్టేషన్లలో పలు కేసులున్నాయి. జిల్లాలో పలు చోట్ల జరుగుతున్న దొంగతనాలపై ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు డీఎస్పీ జగదీష్ నాయక్ పర్యవేక్షణలో చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై, సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం రూరల్ సీఐకి వచ్చిన సమాచారం మేరకు ఇద్దరిని తోటవారిపాలెం గ్రామంలోని కుందేరు కాలువ కల్వర్టు వద్ద అరెస్ట్ చేసి రూ.2.57లక్షల విలువ గల ఏడు కేసుల్లో దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు. వీటిలో 13 ఎలక్ట్రికల్ మోటార్లు, రెండు గేదెలు, రెండు దూడలు ఉన్నాయి. ఈ కేసులో ప్రతిభ చూపిన చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్, రూరల్ సీఐ శేషగిరిరావు, చీరాల రూరల్ ఎస్సై ఎం.శివకుమార్, సిబ్బంది తన్నీరు శ్రీనివాసరావు, బి.అచ్చయ్య, జి.ప్రసాద్, బాలచంద్ర, కె.శ్రీనివాసరావు, కె.నాగాంజనేయులు, కె.సుబ్బారావు, డి.కృపారావులను ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న మోటార్లు

న్యూస్‌రీల్

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్



కారంచేడు: నూరు శాతం పింఛన్లు పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నట్లు బాపట్ల కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. శుక్రవారం కారంచేడు గ్రామంలోని అంబేడ్కర్ నగర్ కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని 26 మండలాలతో పాటు చీరాల అర్బన్, అద్దంకి అర్బన్, బాపట్ల మున్సిపాలిటీ ప్రాంతాల్లో మొత్తం 2,29,635 మందికి రూ.95,61,79,000 విడుదల చేశామని పేర్కొన్నారు. చీరాల ఆర్డీఓ చంద్రశేఖరనాయుడు, బాపట్ల జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి శ్యామ్, ఎంపీడీఓ నేతాజీ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తిక మాస పూజలకు ఏర్పాట్లు పూర్తి



రేపల్లె రూరల్: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు దేవాలయాలలో పూజలకు, భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవదాయ, ధర్మదాయశాఖ అధికారి జె.సూర్యప్రకాశరావు చెప్పారు. మండలంలోని పలు శివాలయాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. శివకేశవులకు ప్రీతిపాత్రమైన కార్తికమాసంలో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలలో ప్రత్యేక పూజలకు వస్తుంటారని, ఈ నేపథ్యంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయం, పెనుమూడి నాగేశ్వరస్వామి ఆలయం, అరవపల్లిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయాలను పరిశీలించారు. ఆయన వెంట ఈఓలు దివి వెంకట అప్పాలాచార్యులు, పి.రాజేశ్వరరావు, ఆలయాల అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరుని సేవలో ఉప లోకాయుక్త జస్టిస్ రజనీరెడ్డి



అమరావతి: అమరావతిలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుని ఉపలోకాయుక్త జస్టిస్ రజనీరెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు జస్టిస్ రజనీరెడ్డి దంపతులకు స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం జస్టిస్ రజనీరెడ్డి దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించి స్వామి శేషవస్త్రంతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సునీల్‌కుమార్, స్థానిక అధికారులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి నేడు రూ.10 లక్షల సాయం అందజేత



చేబ్రోలు: కొత్తరెడ్డిపాలెం గ్రామంలో కొద్ది కాలం క్రితం దళిత విద్యార్థిని హత్యకు గురైన నేపథ్యంలో బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రూ.పది లక్షల ఆర్థిక సాయాన్ని శనివారం పార్టీ నాయకులు అందజేయనున్నట్టు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. జూలై 15న విద్యార్థిని పేరుపోగు శైలజను గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజు హత్య చేశాడు. నిందితుడిని పోలీసులు ఇంత వరకు అరెస్ట్ చేయలేకపోయారు. శైలజ కుటుంబ సభ్యులకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు శనివారం మధ్యాహ్నం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ చెక్కు అందజేయనున్నారు.

క్లుప్తంగా

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్టుకు శిక్షణ పూర్తి



జె.పంగులూరు: ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు అనకాపల్లి జిల్లా తుమ్మలపాలంలో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు జరగనున్నట్లు శుక్రవారం రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతా రామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ -17 బాలుర జట్టుకు 10 రోజుల నుంచి స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయ ణమ్మ జూనియర్ కళాశాలలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ, స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కోచ్లుగా జిల్లా కార్యదర్శి, కంచర్లవారిపాలెం వ్యాయామ ఉపాధ్యాయులు భవనం కాశీవిశ్వనాథ్ రెడ్డి, రుద్రవరం పీడీ కె. హనుమంతు రావు వ్యవహరించినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ హాజీంబేగం తెలిపారు. జట్టు మేనేజర్లుగా సీనియర్ క్రీడాకారులు ఎన్. అజయ్, పి. శివగణేశ్ రెడ్డి వ్యవహరిస్తారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అద్దంకి: ఎలుకల మందు తిన్న వివాహిత రెండు రోజులపాటు మృత్యువుతో పోరాడి శనివారం ప్రాణాలు విడిచింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఉమెన్ ఎస్సై ప్రవీణ కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రాళ్లపల్లి గ్రామానికి చెందిన దాసరి అంజయ్య, వీరమ్మల కుమార్తె అనూష (23)కు చక్రాయపాలెం గ్రామానికి చెందిన గంగాధర్తో 8 సంవత్సరాల క్రితం వివాహం అయింది. ఈ నేపథ్యంలో తిమ్మాయపాలెం గ్రామ సమీపంలోని ఇటుకల బట్టీల్లో దంపతులు పని చేసుకుంటూ కొంత కాలం బాగానే ఉన్నారు. అనంతరం గంగాధర్ చెడు వ్యసనాలకు బానిసై తరచూ భార్యను వేధించసాగాడు. జీవితంపై విరక్తి చెందిన అనూష శుక్రవారం ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. గంగాధర్ ఆమెను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచి ఒంగోలు జీజీహెచ్కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది.

అన్న హత్య కేసులో తమ్ముడి సహా 10 మంది అరెస్టు

- ఆస్తి తగాదాలే కారణం
- వివరాలు వెల్లడించిన సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

సత్తెనపల్లి: ఆస్తి తగాదాల నేపథ్యంలో అన్నను తమ్ముడు బంధువులతో కలిసి హతమార్చిన ఘటన క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామంలో గత నెల 27న జరిగింది. దాడిలో చికిత్స పొందుతూ అన్న షేక్ మహబూబ్ బాషా (28) గత నెల 28న మృతి చెందాడు. ఈ హత్య కేసులో తమ్ముడితోపాటు మరో 9 మంది బంధువులను పోలీసులు అరెస్ట్ చేశారు. సత్తెనపల్లిలోని డీఎస్పీ కార్యాలయంలో గురువారం అరెస్ట్ వివరాలను డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామానికి చెందిన షేక్ మున్నీబీకి ఇద్దరు భర్తలు ఉన్నారు. ఆమె మొదటి భర్త రెడ్డిగూడెం హుస్సేన్ సాకు షేక్ మహబూబ్ బాషా కుమారుడు ఉన్నాడు. మొదటి భర్తతో ఆమెకు చిన్న, చిన్న గొడవలు జరగగా ఇరువురు విడాకులు తీసుకున్నారు. మొదటి భర్త కుమారుడైన షేక్ మహబూబ్ భాషాకి తండ్రి ద్వారా ఎకరంన్నర పొలం, ఐదు సెంట్ల స్థలంతో పాటు తాత(తల్లి తండ్రి) ద్వారా మరో అర ఎకరం పొలం వచ్చింది. మున్నిబీకి అర ఎకరం పొలం వచ్చింది. అనంతరం తమ్మవరం గ్రామస్తుడైన షేక్ కరీముల్లాను మున్నిబీ రెండో వివాహం చేసుకుంది. వారికి కుమార్తె షేక్ ఫాతిమా, కుమారుడు షేక్ అబ్దుల్ బాసిత్ అలియాస్ బాలు ఉన్నారు. 15 సంవత్సరాల క్రితం మున్నిబీ రెండో భర్త షేక్ కరీముల్లా మృతి చెందాడు. ఆ సమయంలో కుమారుడు షేక్ అబ్దుల్ బాసిత్ కి తన తండ్రి షేక్ కరీముల్లా ద్వారా 50 సెంట్ల పొలం, 25 సెంట్ల స్థలం తమ్మవరం గ్రామంలో రాసిచ్చారు. సుమారు 13 సంవత్సరాల క్రితం మొదటి భర్త కుమారుడు షేక్ మహబూబ్బాషా, షేక్ మున్నిబీ క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామం వచ్చి నివాసం ఉంటున్నారు.

తరచూ గొడవలు

ఈ క్రమంలో షేక్ మహబూబ్ బాషాకు ఎక్కువ ఆస్తి వచ్చిందని తమ్ముడైన అబ్దుల్ బాసిత్కి తక్కువ ఆస్తి వచ్చిందని తరచూ గొడవలు పడుతూ పెద్ద మనుషులతో పంచాయితీ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అన్నను చంపితే అతని తండ్రి ద్వారా సంక్రమించిన 1.60 ఎకరాల ఆస్తి తనకు చెందుతుందని అబ్దుల్ బాసిత్ భావించాడు. గత నెల 27న రాత్రి సుమారు 8:15 గంటల సమయంలో షేక్ మహబూబ్ బాషా ఇంట్లోకి అబ్దుల్ బాసిత్ 14 మందితో అక్రమంగా ప్రవేశించాడు. బాషా కళ్ళల్లో కారం కొట్టి కర్రలు, రాడ్లతో దాడి చేశాడు. బాషా భార్యను, మామను, బావమరిదిపైనా దాడి చేశాడు. గుంటూరు జీజీహెచ్లో చికిత్స పొందుతూ గత నెల 28న బాషా మృతి చెందాడు. మిగిలిన వారు తీవ్ర గాయాలతో గుంటూరు జీజీహెచ్లో చికిత్స పొందుతున్నారు.

ప్రత్యేక బృందంతో దర్యాప్తు

పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు పర్యవేక్షణలో పెదకూరపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.సురేష్, క్రోసూర్ ఎస్ఐ కె.నాగేంద్రరావు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకొని వ్యూహాత్మకంగా అన్ని కోణాల్లో దర్యాప్తుచేశారు. గత నెల 30న హసనాబాద్ గ్రామంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. షేక్ అబ్దుల్ బాసిత్, షేక్ మున్నిబీ, షేక్ నాగుల్మీరా, షేక్ నన్నేసాహెబ్, షేక్ మాబూ సుభాని, షేక్ మహబూసుభాని, షేక్ గారపాటి కరిముల్లా, షేక్ గారపాటి పెదబాజి, షేక్ నుసరత్ అలియాస్ నుసరత్ అలీలను అరెస్ట్ చేశారు. వారి నుంచి ఇనప రాడ్లు, మోటార్ సైకిల్, సరివి కర్రలు, మొబైల్ ఫోన్లు స్వాధీనపరచుకున్నారు. అరెస్టు చేసిన 10 మందిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. మిగిలిన వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు. హత్యకేసును త్వరితగతిన చేదించిన పెదకూరపాడు సీఐ పి.సురేష్, క్రోసూరు ఎస్ఐ కె.నాగేంద్రరావు, హెడ్ కానిస్టేబుల్ మోర్ల అంకమ్మరావు, పోలీస్ కానిస్టేబుళ్లను డీఎస్పీ హనుమంతరావు ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్యవైశ్యుడిననే పోలీసుల వేధింపులు

- బాణసంచా వ్యాపారి ప్రదీప్ ఆవేదన
- రూరల్ సీఐ, ఎస్ఐలు వేధించారని ఆరోపణ
- టపాసుల దుకాణానికి తాళాలు వేసి తమ వద్దే ఉంచుకున్నారని ఆగ్రహం
- ఎస్పీకి, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న బాణసంచా వ్యాపారి ప్రదీప్

చిలకలూరిపేట: 'తాను ఆర్యవైశ్యుడని పోలీసులు వేధిస్తున్నారని కేవీఆర్ ట్రేడింగ్ కంపెనీ బాణసంచా దుకాణ యజమాని కె.ప్రదీప్ వాపోయాడు. దీపావళి రోజైన గురువారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు, ఎస్ఐ అనిల్కుమార్ పోలీసు సిబ్బందితో కలసి బాణసంచా దుకాణాన్ని మూయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఐ, ఎస్ఐ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఎవరిదో సెల్ఫోన్ పోయిందన్న నెపంతో దుకాణంలోకి ప్రవేశించి కస్టమర్లను తిట్టి బయటకు పంపించి వేశారని ఆరోపించారు. దుకాణానికి తాళాలు వేసి వారి వద్దే ఉంచుకున్నారని, పండుగ రోజు వ్యాపారం చేసుకోకుండా అడ్డుకున్నారని చెప్పారు.

ఇరువురు గుమస్తాలను అదుపులోకి తీసుకొని పోలీస్స్టేషన్కు తీసుకువెళ్లి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంచుకొని తెల్లకాగితాలపై సంతకాలు పెట్టించుకొని విడిచిపెట్టారని తెలిపారు. దుకాణం ఎలా తెరుస్తావు, వ్యాపారం ఎలా చేస్తారు అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని వివరించారు. అన్ని లైసెన్సులు ఉన్నా, అడిగినంత డబ్బు, ఫార్మాలిటీలు చెల్లించినప్పటికీ వ్యాపారాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. ఇదే సమయంలో ఎలాంటి అనుమతులు లేని బాణసంచా దుకాణాన్ని సిబ్బందిని కాపలా పెట్టి నిర్వహింపజేశారని విమర్శించారు. గత వినాయకచవితి సమయంలోనూ ఎస్ఐ అనిల్ కుమార్ తన గ్రామంలో మందులు కాల్చాలని డబ్బులు చెల్లించకుండా బాణసంచా సామగ్రి తీసుకువెళ్లారని ఆరోపించారు. ఇప్పుడు కూడా లైసెన్సులు ఉన్న ఐదు దుకాణాల్లో విచ్చలవిడిగా బాణసంచా సామగ్రి తీసుకువెళ్లారని చెప్పారు. జరిగిన ఘటన రికార్డు చేస్తున్నారని పనిచేసే సిబ్బంది సెల్ఫోన్లు లాక్కొని వారి మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీతో పాటు, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి సుభాషిణిని సత్కరిస్తున్న రూతు రమ్య తదితరులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో జెండర్ సెన్సిటైజేషన్పై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి సుభాషిణి విచ్చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలను గౌరవించాలని, వారు కూడా అన్ని రంగాల్లో రాణించే సామర్థ్యం గలవారని పేర్కొన్నారు. పురుషులతోపాటు వారికి కూడా సమానావకాశాలు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ రూతు రమ్య, కార్యక్రమ కో ఆర్డినేటర్ ఎ. విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీవీ ప్రసాద్



పత్తి సాగును పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తాడికొండ: సీసీఐ నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో రైతు పోలు నాగేశ్వరరావుకు చెందిన పత్తి పంటను సంఘం నాయకులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ ఏడాది తాడికొండ, తుళ్ళూరు పరిసరాలలో రైతులు అధిక మొత్తంలో పత్తి సాగు చేస్తున్నారని చెప్పారు. ఇటీవల వర్షాల నేపథ్యంలో పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. ఎకరాకు 15 క్వింటాలు దిగుబడికి బదులు 3 క్వింటాలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కౌలు, పెట్టుబడులు సైతం నష్టపోయేలా ఉన్నారని తెలిపారు. సీసీఐ ద్వారా పత్తిని రూ.5 వేలకు అటు ఇటూ కొనుగోలు చేయడం తగదన్నారు. క్వింటా రూ.7,521 చొప్పున కొనుగోలు చేయాలన్నారు. పత్తి రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల వర్షాలకు పంట నష్టం జరిగితే అంచనా సక్రమంగా వేయలేదని ఆరోపించారు. పంట బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లాల రైతు సంఘం గౌరవాధ్యక్షులు గుర్రంకొండ సత్యానందం, చింతల భాస్కరరావు, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు, రైతులు రామినేని రామారావు, శంకరరావులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన పోలీసులు



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

నరసరావుపేట: దేశ భద్రత, సమాజ రక్షణ కోసం అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అక్టోబరు 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాల్లో భాగంగా గురువారం సాయంత్రం పోలీసు అధికారులు, సిబ్బంది క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ లింగంగుంట్ల సెంటర్ వరకు కొనసాగింది. దీనిలో భాగంగా ప్రజాస్వామ్య పరిరక్షణ, సమాజ శ్రేయస్సుకై అహర్నిశలు పోరాడి అమరులైన పోలీసుల త్యాగ నిరతికి ఇవే మా జోహార్లు అంటూ అధికారులు అమరవీరులను స్మరించుకున్నారు. ఏఆర్ డీఎస్పీ మహాత్మ గాంధీరెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్ పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సదస్సులో పాల్గొన్న ఉర్దూ ఉపాధ్యాయులు

నరసరావుపేట ఈస్ట్: ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ పల్నాడు జిల్లా ఉర్దూ ఉపాధ్యాయుల సదస్సు తీర్మానించింది. రామిరెడ్డిపేటలోని శ్రీగాలీబ్ ఉర్దూ పాఠశాలలో ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి పల్నాడుజిల్లా యూనిట్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షత వహించారు. సదస్సులో అన్ని జిల్లాలకు ఉర్దూ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, డెప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఉర్దూ స్కూల్స్ పోస్ట్లకు మంజూరు చేసి భర్తీ చేయాలని కోరుతూ తీర్మానించారు. అలాగే రానున్న డీఎస్సీలో ఉర్దూ ఖాళీలను భర్తీ చేయాలని, ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ స్థాయి వరకు బోధనా సిబ్బందిని భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా షేక్ మహబూబ్ సుభానీ, ప్రధాన కార్యదర్శిగా షేక్ మొహిద్దీన్ బాషా, ఫైనాన్స్ కార్యదర్శిగా షేక్ ఆదంషఫీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ముజీబ్ షాహి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రోషన్ జమీర్, ఫైనాన్స్ కార్యదర్శి అబ్దుల్ షజీర్ పాల్గొన్నారు.

హోటల్లో బ్లేడ్ బ్యాచ్ హల్చల్

- ఫ్రైడ్ రైస్ ధరపై వివాదం
- యజమానిపై అడ్డగోలుగా దాడి
- అడ్డొచ్చిన మహిళపైనా పిడిగుద్దులు
- బ్లేడుతో స్థానికులకు బెదిరింపులు



గాయపడిన హోటల్ యజమాని రాజు



పనిచేసే మహిళపై దాడి చేస్తున్న దృశ్యం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్స్టేషన్ పరిధిలోని ఉండవల్లి సెంటర్లో ఓ చిరు వ్యాపారిపై, ఆయన సహాయకురాలిపై బ్లేడ్ బ్యాచ్ దాడి చేసింది. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. బాధితుడైన రాజు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఒక మహిళ వచ్చి ఫ్రైడ్రైస్ అడిగింది. ఆమె తరువాత మరో మహిళ వచ్చింది. ప్లేటు ఫ్రైడ్ రైస్ రూ.80 అని చెప్పగా.. మంగళగిరిలో రూ.50కి ఇస్తున్నారు, నువ్వేంటి ఎక్కువ చెబుతున్నావని ప్రశ్నించింది. అంత తక్కువకు ఇస్తే తాను కూడా వస్తానని, తనకూ ఇప్పించాలని రాజు అన్నారు. దీంతో ఆ ఇద్దరు మహిళలు ఒక్కసారిగా ఆయనపై దాడి చేశారు. అనంతరం 9.30 సమయంలో మరో 15 మంది వచ్చి హోటల్లో సామాన్లు బయటకు విసిరివేశారు. రాజు తల పగలకొట్టారు. హోటల్లో పని చేస్తున్న మహిళను కూడా రోడ్డుపైకి లాక్కెళ్లి పిడిగుద్దులు కురిపిస్తూ దాడి చేశారు. వస్త్రాలు కూడా చించివేశారు. వారిని కొందరు స్థానికులు అడ్డుకోబోగా బ్లేడులు చూపించడంతో భయంతో పరుగులు తీశారు. మరోసారి రాజుపై దాడి చేయడంతో హోటల్ వదిలి పారిపోయారు. అమరావతి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంతమందితో కూడిన బ్లేడ్ బ్యాచ్ను అమరావతి నుంచి బహిష్కరించగా... వారు ఉండవల్లి సెంటర్ శ్మశాన వాటిక వద్ద తలదాచుకున్నారని, వీరు ప్రతి గొడవలోనూ ఇలాగే దాడికి పాల్పడి కౌంటర్లలో ఉన్న డబ్బులు లాక్కెళతారని విశ్వసనీయ సమాచారం. జరిగిన ఘటనపై సీఐ కళ్యాణ్ రాజు మాట్లాడుతూ... హోటల్పై దాడి చేసిన మాట వాస్తవమేనని చెప్పారు. ఆ దాడిలో పాల్గొన్నవారు బ్లేడ్ బ్యాచ్ వారా? కాదా? అని విచారణ చేపట్టామని తెలిపారు. బ్లేడుతో కోస్తున్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని ఆయన అన్నారు.

అంబేద్కర్ స్మృతివనంపై ఇంత నిర్లక్ష్యమా?

హైకోర్టు న్యాయవాది పెరికల డేనియల్



సమావేశంలో డేనియల్, శ్రీధర్

తెనాలి: విజయవాడలో నిర్మించిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనం నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, ఇది ఆ మహానుభావుడిని అవమానించడమేనని హైకోర్టు న్యాయవాది పెరికల డేనియల్ అన్నారు. స్థానిక అయితానగర్లోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్మృతి వనం లోపలిభాగంలో ఉన్న ఏసీలు ఇటీవల పని చేయటం లేదన్నారు. కరెంటు చార్జీలు భారంగా మారాయని అధికారులు అనటం హాస్యాస్పందంగా ఉందన్నారు. గతంలో ఎల్ఈడీ స్క్రీన్స్పై విజ్ఞానదాయకమైన క్విజ్ ప్రోగ్రాంలు వచ్చేవని, ప్రస్తుతం ఆపేశారని తెలిపారు. ఎవరి ప్రమేయంతో ఇలా నిలుపుదల చేశారని ప్రశ్నించారు. ఆడిటోరియం నిర్మించారని, ఫుడ్కోర్టులు రెండు నిర్మాణంలో ఉండేవని చెబుతూ... ఇప్పుడు వాటి పరిస్థితి ఏంటని అడిగారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, హైకోర్టు న్యాయవాది దాసరి శ్రీధర్ కూడా సమావేశంలో పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో మొరాయించిన సర్వర్లు

కారంచేడు: ప్రతి నెలా 1వ తేదీన వేకువజామున 5 గంటలనే తమకు కేటాయించిన ప్రాంతంలో లాగిన్ అవ్వాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసిన అధికారులు .. సర్వర్లు పనిచేయకపోయినా స్పందించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ఉదయం 5 గంటల్లోపు గ్రామాలకు ఉద్యోగులు వెళ్లినా సర్వర్లు పనిచేయలేదు. నానా అవస్థలు పడ్డారు. చాలాసేపటి తర్వాత అందుబాటులోకి వచ్చాయి. పంపిణీ ప్రారంభించిన సిబ్బందికి గంటలోనే మళ్లీ సర్వరు సమస్యలు తలెత్తాయి. చేసేది లేక సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసి చెట్ల కింద ఆపసోపాలు పడ్డారు. కారంచేడు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే సమస్య ఉత్పన్నమైంది. మధ్యాహ్నం 1:30 గంటలకు సర్వర్లు అందుబాటులోకి రాడవంతో పంపిణీ ప్రారంభించారు.

7న ఆచార్య ఎన్జీ రంగా జయంతి

పొన్నూరు: లాం లోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలోని కృష్ణా ఆడిటోరియంలో ఈ నెల 7వ తేదీన రంగా ట్రస్టు ఆధ్వర్యంలో సమరయోధుడు ఆచార్య ఎన్జీ రంగా 124వ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ట్రస్టు కమిటీ సభ్యుడు రామినేని కిషోర్బాబు శుక్రవారం నిడుబ్రోలులోని ట్రస్టు కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. సమావేశంలో ఆకుల జానకిబాబు, నన్నపనేని ప్రభాకరరావు, గోగినేని వెంకటేశ్వరరావు, వెలగా సుబ్బారావు పాల్గొన్నారు.

కామాంధుడిగా మారిన చిన్నాన్న

గర్భం దాల్చిన 14 ఏళ్ల బాలిక

పెదకాకాని: తండ్రిలా కాపాడాల్సిన బాబాయి కామాంధుడిలా మారడంతో 14 ఏళ్ల బాలిక గర్భం దాల్చింది. ఈ సంఘటన పెదకాకాని మండలంలో వెలుగుచూసింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త మరణించారు. అప్పటికే వారికి ముగ్గురు సంతానం. ఇద్దరు బాలురు, ఓ బాలికను పోషించుకుంటూ ఆమె జీవనం సాగిస్తోంది. బాలిక ఐదవ తరగతి వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. అదే ప్రదేశంలో ఉంటున్న చిన్నాన్న తాపీ పనులు చేస్తుంటాడు. అతడి కన్ను స్వయానా అన్న కుమార్తెపై పడింది. మాయమాటలు చెప్పి లోబరచుకున్నాడు. ఎనిమిది నెలలుగా ఆ బాలికపై దారుణానికి ఒడిగడుతున్నాడు. ప్రస్తుతం బాలికకు నెలసరి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి స్థానిక డాక్టర్కు చూపించారు. బాలిక మూడు నెలల గర్భంతో ఉన్నట్లు వైద్యుడు నిర్ధారించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు గురువారం నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతోందని పెదకాకాని పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మాహుతియత్నం

తెనాలి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మాహుతియత్నం చేసింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని బాలాజీరావుపేటకు చెందిన అఫ్సానా, రమేష్ ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. రమేష్ కార్పెంటర్. అఫ్సానా బిర్యానీ పాయింట్లో పనిచేస్తోంది. భర్త నిత్యం అనుమానంతో వేధింపులకు గురి చేస్తున్నాడు. భరించలేక వారం రోజుల క్రితం ఆమె పుట్టింటికి వచ్చింది. భర్త పట్టించుకోకపోవడం, తండ్రి మంచానికే పరిమితమై ఉండడంతో తాను తల్లికి భారం అవుతానని అఫ్సానా భావించింది. గురువారం మార్కెట్ ఏరియాలో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మాహుతియత్నం చేసింది. స్థానికులు మంటలను ఆర్పి తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వన్టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని: వేగంగా వస్తున్న రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గడ్డిపాడు సమీపంలో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని గడ్డిపాడు సమీపంలో ఉన్న ఇన్నర్రింగ్ రోడ్డు రైల్వేగేటు సమీపంలో శుక్రవారం ఉదయం 11:30 గంటలకు కోలకత్తా నుంచి పుట్టపర్తి రైలు వేగంగా వెళుతోంది. అప్పటి వరకూ అక్కడే ఉన్న మాచర్ల శ్రీహరిబాబు ఒక్కసారిగా పరిగెత్తుకుంటూ వెళ్లి రైలు కింద పడ్డాడు. క్షణాల్లోనే ఆయన శరీరం ఛిద్రమైంది. మృతదేహం భాగాలుగా విడిపోయింది. పర్సులో ఉన్న ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా తారకరామనగర్కు చెందిన మాచర్ల శ్రీహరిబాబు(35) ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. గుంటూరు రైల్వే పోలీసులు వచ్చి మృతదేహన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.


అంతర్జాతీయ సదస్సుకు ఏఎన్యూ ఆచార్యులు

ఏఎన్యూ: ఈ నెల 8, 9 తేదీలలో థాయ్లాండ్, బ్యాంకాక్లో 'పరిశోధన , ఆవిష్కరణల'పై జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కె మధుబాబు, హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య బి. నాగరాజులు హాజరు కానున్నారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ అసోసియేషన్ నుంచి ఆహ్వాన పత్రిక అందినట్లు వారు తెలిపారు. సదస్సులో 'స్వచ్ఛ భారత్ మిషన్ అండ్ ఇట్స్ రోల్ ఇన్ ట్రాన్స్ఫార్మింగ్ రూరల్ శానిటేషన్ ఇన్ ఇండియా'పై ఆచార్య మధుబాబు, 'ఎక్స్ప్లోరింగ్ క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ ఫర్ వుమెన్ ఎంప్లాయిస్: ఏ కేస్ స్టడీ ఇన్ సౌత్ సెంట్రల్ రైల్వే' పై ఆచార్య నాగరాజు పరిశోధన పత్రం సమర్పించేందుకు అనుమతి లభించింది. వీరిని వర్సిటీ ఉన్నతాధికారులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.


ప్రిన్సిపల్గా ఆచార్య సురేష్ బాధ్యతల స్వీకరణ

ఏఎన్యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల నూతన ప్రిన్సిపల్గా ఇంగ్లిష్ విభాగం ఆచార్యులు, ట్రాన్స్లేషన్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం. సురేష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వైస్ ప్రిన్సిపల్గా వ్యవహరించిన ఆయన పదోన్నతి పొందారు. మాజీ ప్రిన్సిపల్ ఆచార్య స్వరూపారాణి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య కె .గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు.

అండర్- 19 క్రికెట్ మ్యాచ్ డ్రా



టి.వరుణ్సాత్విక్, 161 పరుగులు



ఏ.దేవిధనుష్, 102 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్కేఆర్బీఆర్ క్రికెట్ గ్రౌండ్లో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 రాష్ట్ర జట్టు ఎంపిక మ్యాచ్లో భాగంగా ఏసీఏ- బీ, ఏసీఏ- సీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఏసీఏ- సీ జట్టు తన తొలి ఇన్నింగ్స్లో 214 పరుగులు చేయగా, ఏసీఏ- బీ జట్టు 593 పరుగులు చేసింది. జట్టులోని టి.వరుణ్ సాత్విక్ 206 బంతుల్లో 161, ఎ.దేవిధనుష్ 236 బంతుల్లో 102 పరుగులతో సెంచరీలు నమోదు చేయగా కేఏఎస్ ప్రసాద్ 78 పరుగులు సాధించాడు. శుక్రవారం రెండో ఇన్నింగ్స్ను ప్రారంభించిన ఏసీఏ- సీ జట్టు ఆట ముగిసే సమయానికి మూడువికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. దీంతో అధికారులు మ్యాచ్ను డ్రాగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించిన ఏసీఏ- బీ జట్టుకు 3 పాయింట్లు, ఏసీఏ- సీ జట్టుకు ఒక పాయింట్ లభించింది. మ్యాచ్ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.